సాక్షి
బాపట్ల
బుధవారం । 16 । జూలై । 2025



పోలేరమ్మకు సారె సమర్పణ

పాతనందాయపాలెం(కర్లపాలెం): స్థానిక గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి మహిళలు మంగళవారం ఆషాఢ సారె సమర్పించి పూజలు చేశారు.



కనకదుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గ అమ్మవారికి మంగళవారం బోనాలు సమర్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మోపిదేవి:మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

పొగాకు కొనుగోలులో పచ్చపాతం

టీడీపీ నాయకుల సిఫార్సుల మేరకే రైతులకు ఫోన్ మెసేజ్‌లు

- పార్టీ నాయకులను ఉద్ధరించడానికేనా కొనుగోలు కేంద్రాలంటున్న రైతులు
- స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే పొగాకు కొనుగోలు
- అధికారులకు కనిపించని సన్న, చిన్నకారు రైతులు
- రైతులు ఆశించినంతగా లేని పొగాకు కొనుగోళ్లు
- ప్రభుత్వ చర్యలతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషణ



పూనూరులో పొగాకు బేళ్లు కడుతున్న రైతులు

పర్చూరు (చినగంజాం): ఆరుగాలం కష్టించి పని చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న పొగాకు రైతులు ప్రభుత్వంతో కూడా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు, కౌలు రైతుల ఆందోళనల మధ్య ప్రభుత్వం ఎట్టకేలకు దిగి వచ్చి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆశించినంతగా కొనుగోళ్లు జరగడం లేదనే విషయమై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేతల సిఫార్సు ఉంటేనే కొనుగోలు

ప్రభుత్వం ద్వారా పొగాకు సేకరణ చేస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్, ఏఎంసీ, డీసీఎంఎస్ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం లేదని, ఎక్కడికక్కడ కొర్రీలు పెడుతూ సక్రమంగా కొనుగోళ్లు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో టీడీపీ నాయకుల సిఫార్సుల మేరకే కొనుగోలు జరుగుతుందనే ఆరోపణలున్నాయి. పొగాకు పండించిన రైతులు అధికారుల సూచనల మేరకు తమ పంట వివరాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఆ రైతులకు మెసేజ్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాల వద్దకు పొగాకు ఎప్పుడు తీసుకొని రావాలనే విషయాన్ని ముందుగా అధికారులు తెలియజేయాల్సి ఉంది. అయితే తమకు మెసేజ్‌లు అందడం లేదని, టీడీపీ నాయకులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే మెసేజ్‌లు వస్తున్నాయని, అది కూడా స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకే కొనుగోలు కేంద్రాల్లో అధికారులు మెసేజ్‌లు పెడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న రైతులు పొగాకు బేళ్లను సిద్ధం చేసుకున్నా మెసేజ్‌లు రాకపోవడంతో రోజుల తరబడి ఎదురు చూస్తున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే సమక్షంలో ఇటీవల కొద్దిపాటి వివాదం కూడా తలెత్తినట్లు సమాచారం. నియోజకవర్గంలోని ఒక టీడీపీ నాయకుడు తాము చెప్పిన వారికే మెసేజ్‌లు పెట్టాలంటూ ఎమ్మెల్యే వద్ద తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం.

అధికారుల కుంటి సాకులు

రైతులు తెచ్చిన పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా అధికారులు కుంటిసాకులు చెబుతూ బేళ్లను వెనక్కి పంపేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులకు మెసేజ్‌లు రావడమే గగనమైతే పేర్లు వచ్చిన రైతుల పొగాకు 20 శాతం మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన దానిలో తేమ శాతం ఎక్కువగా ఉందనో, నాణ్యత సక్రమంగా లేదనే సాకులు చెబుతూ పంపిస్తున్నారు. ఒకే భూమిలో పండించిన ఒకే పంటను నాణ్యత కొరవడిందంటూ తిప్పి పంపించడం ఎంత వరకు సమంజసమంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చేందుకు పొగాకు బేళ్లను కట్టాల్సి ఉండగా అందుకోసం బేలుకు రూ.150, రవాణా రూ.70 మొత్తం రూ.220 ఖర్చవుతుండగా మళ్లీ కొనుగోలు కేంద్రంలో అధికారులు తిప్పి పంపితే అదే ఖర్చు ఇంటి దాకా తీసుకెళ్లేందుకు అవుతోంది.

ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేందుకు సిద్ధమవుతున్న రైతులు

పొగాకు కొనుగోలు కేంద్రాల్లో అధికారులు బేళ్లను ఏదో ఒక సాకు చెప్పి కొర్రీలు పెట్టి తిప్పి పంపుతుండటంతో తమ పంటను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. పొగాకు కొనుగోలు కేంద్రంలో రూ.12 వేలు పలుకుతున్న పొగాకును ప్రైవేటు వ్యక్తులు అతి తక్కువగా రూ.8500లకే కొనుగోలు చేస్తున్నారు. టీడీపీ నాయకులు కొందరు దళారులుగా మారి రైతులను మోసానికి గురి చేస్తున్నారు.

పర్చూరు నియోజకవర్గంలో పొగాకు కొనుగోలు పరిస్థితి

మండలం	పండించిన రైతులు	పంట దిగుబడి (క్వింటాలు)	రైతుల వద్ద నిల్వ (క్వింటాలు)
ఇంకొల్లు	1892	1,05,990	1,00,508
యద్దనపూడి	1950	1,17,500	1,17,000
మార్టూరు	701	27,349	1927
కారంచేడు	1852	97950	5650
పర్చూరు	4359	3,11,838	12,138
చినగంజాం	290	16629	315

ఆశించిన స్థాయిలో సాగని కొనుగోళ్లు

పొగాకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు 15 శాతం మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. చిలకలూరిపేట ప్రాంతంలో ఏర్పాటుచేసిన కేంద్రంలో గడచిన వారంలో అతి తక్కువగా 73.22 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు జరిగింది. పంగులూరు, పర్చూరుల్లోని కేంద్రాల్లో అతి తక్కువగా కొనుగోలు జరిగింది. మొత్తం 11 కొనుగోలు కేంద్రాల్లో 2 వేల మెట్రిక్ టన్నులకు మించి పొగాకు కొనుగోలు జరగలేదు. పొగాకు కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తీసుకొచ్చిన పొగాకులో 20 శాతం మాత్రమే తీసుకొని మిగిలిన వాటిని తిప్పి పంపించేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దాంతో ముందుగా మెసేజ్‌లు వచ్చిన కొందరు రైతులు తమ పలుకుబడి ఉపయోగించి ప్రైవేట్ మార్కెట్‌లో కొనుగోలు చేసి మార్క్‌ఫెడ్ వాళ్లకే అమ్ముతున్నట్లు సమాచారం.



యద్దనపూడిలో నిల్వ ఉన్న పొగాకు బేళ్లు

మొత్తం కొనుగోలు చేయాలి

పొగాకు కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేయాలి. పొగాకు కొనుగోలును వేగవంతం చేయాలి. ఈ నెలాఖరులోగా కొనాలి. పంట సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా కొనుగోలు పూర్తి చేసి రైతులకు నగదు అందజేస్తే తరువాత సాగుకు ఉపయోగకరంగా ఉంటుంది.

– కందిమళ్ల రామకోటేశ్వరరావు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు



రైతులందరికీ న్యాయం చేయాలి

ప్రభుత్వం, అధికారులు బర్లీ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని గతంలో ప్రకటించారు. పొగాకు పండించిన రైతులందరికీ న్యాయం జరిగేలా కొనుగోలు చేపట్టాలి. సన్న, చిన్న కారు రైతులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– భవనం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడు



అప్పు తీర్చుకునే అవకాశం కల్పించండి

నాలుగేళ్లుగా పొగాకు సాగు లాభసాటిగా ఉండటంతో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాను. సుమారు రూ.30 లక్షలు ఖర్చయింది. అందులో సగానికి పైగా అప్పు చేశాను. ధర లేక ఇబ్బందులు పడుతున్నాను. కొనుగోలు కేంద్రం ద్వారా పంటకొనుగోలు చేయాలి.

– విజయ్, కౌలు రైతు



ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా పొగాకు కొనుగోలు చేసి ఆదుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా రైతులకు మేలు జరిగింది.

– జి.మధుసూదనరెడ్డి, వైఎస్సార్ సీపీ పర్చూరు ఇన్‌చార్జి



న్యూస్‌రీల్

నేడు వన్ కే వాక్

రేపల్లె: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక తాలూకా కార్యాలయం నుంచి వన్ కే వాక్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నివర్గాల కేసుల పరిష్కారం కోసం, దేశం కోసం మధ్యవర్తిత్వం అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేలా రాష్ట్ర వ్యాప్తంగా వన్ కే వాక్ నిర్వహించాలని రాష్ట్ర న్యాయశాఖ నిర్ణయించిందన్నారు. వన్ కే వాక్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుబ్బారావు



బాపట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ సుబ్బారావు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ అమెండ్మెంట్ రద్దు చేయాలని కోరారు. ఈ బిల్లు అమలులోకి వస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లేగాక, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కూడా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏనిమిదో పే కమిషన్‌ను వెంటనే నియమించాలని, మిగిలిపోయిన డీఆర్, డీఏ ఇన్‌స్టాల్‌మెంట్స్‌ను కేంద్ర ప్రభుత్వం వలే 55 శాతం విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో ఒక సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.పాపారావు డిమాండ్ చేశారు. రైల్వే, విమాన టికెట్లలో సీనియర్ సిటిజన్‌కు రాయితీలను తిరిగి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.సుబ్బారావు, నాగమల్లేశ్వరరావు, రాంబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

556.60 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 556.60 అడుగులకు చేరింది. ఇది 224.5548 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 64,789 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

'స్థానిక' పరిపాలనలో మహిళా భాగస్వామ్యం పెరగాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్ : స్థానిక సంస్థల పరిపాలనలో మహిళా భాగస్వామ్యం పెరగాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం "మహిళా నాయకత్వంలో మార్పు–స్థానిక స్వపరిపాలనలో సాధికారత" అనే అంశంపై మహిళా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్‌ఏ) వార్షిక ప్రణాళిక 2025–26లో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ మహిళా నాయకత్వంలో మార్పు ద్వారా స్థానిక పాలనలో స్వపరిపాలన సాధ్యపడుతుందని అన్నారు. గ్రామస్థాయిలో మహిళా ప్రజా ప్రతినిధులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సూచించారు.

ఈద్గా స్థలం కోసం క్షేత్రస్థాయి పరిశీలన

యద్దనపూడి: ఈద్గా స్థలం కేటాయింపునకు సంబంధించి ముస్లిం ప్రతినిధులు చేసిన వినతిని పరిగణలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఆర్డీవో మధులత కోట గ్రామాన్ని సందర్శించారు. మంగళవారం స్థానికంగా ఉన్న ప్రతిపాదిత భూములను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, ఈద్గా కోసం అభ్యర్థించిన స్థలం మొత్తం 51 సెంట్లు ఉంది. ఇది రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలో, మూడు సర్వే నంబర్లలో విస్తరించి ఉందన్నారు. అందులో కొంత భాగం శ్మశానం, కాలువ, ఖాళీ భూమిగా ఉంది. స్థానికుల వినతిని దృష్టిలో ఉంచుకుని అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి

డాక్టర్ మధుకర్ గుప్తా



మాట్లాడుతున్న రాష్ట్రాల ఎన్నికల కమిషనర్స్ చైర్మన్ డాక్టర్ మధుకర్‌గుప్తా

బాపట్ల స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్స్ చైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుకర్ గుప్తా అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ ఉండాలని అన్నారు. పంచాయతీరాజ్ చట్ట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డీలిమిటేషన్, రిజర్వేషన్ అమలు పరిశీలించాలని, ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. రాజకీయంగా ప్రభావితం చేసే అంశాలను ముందస్తుగా గుర్తించాలన్నారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకుని ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. బాపట్ల జిల్లాలో 459 గ్రామపంచాయతీలు ఉన్నాయన్నా రు. 426 పంచాయతీలకు ఎన్నికలు జరిగా యని, మిగిలినవి కోర్టు కేసుల నేపథ్యంలో నిలిచిపోయాయన్నారు. 4,306 వార్డులు ఉండగా, గత ఎన్నికల్లో గెలుపొందిన వారి అధికారాలు 2026 ఏప్రిల్ ఒకటో తేదీ నాటితో ముగుస్తాయన్నారు. జిల్లా పరిషత్ స్థానాలు గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోనే ఉన్నాయన్నారు. గుంటూరు పరిధిలో 862 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 57 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయన్నారు. ప్రకాశం జిల్లా పరిషత్ పరిధిలో 792 ఎంపీటీసీ స్థానాలు, 57 జెడ్పీటీసీ స్థానాలున్నాయన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియకు ప్రణాళికలు రూపొందించాలని ఆమె సూచించారు. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 50 శాతం మహిళలకు రిజర్వేషన్ అమలు చేశామని తెలిపారు. జిల్లాలో 12,60,997 ఓటర్లు ఉండగా, అందులో 6,44,171 మంది మహిళా ఓటర్లు, 6,16,826 మంది పురుష ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీపీఓ ప్రభాకరరావు, గుంటూరు జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ప్రకాశం జెడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్డీవో పి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్



సమస్యను వివరిస్తున్న వినియోగదారులు

బాపట్ల: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ హెచ్చరించారు. మంగళవారం విద్యుత్ శాఖ బాపట్ల డివిజన్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతీయ విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (విజయవాడ) ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సుకు ఇమ్మానుయేల్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కర్లపాలెం మండలం గణపవరంలో గ్రామంలో లోఓల్టేజి సమస్య తీర్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు గ్రామస్తుల నుంచి రూ.రెండు లక్షలు వసూలు చేసి ఇంతవరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఈ అంశంపై దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలన్నారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో ఓ పూరి గుడిసెలో విద్యుత్ మీటరుకు ఒకే నెలలో రూ.లక్ష విద్యుత్ బిల్లు వచ్చిందని, దానిని పరిశీలించి ఎందుకు పరిష్కరించలేదని అధికారులను నిలదీశారు. 2020లో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కర్లపాలెం మండలం గణపవరం గ్రామంలో మురళీకృష్ణ విద్యుత్ శాఖకు డబ్బు జమ చేసినా ఇప్పటివరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బాపట్ల విద్యుత్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న రామ్ సురేష్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన తీరుపై ఇమ్మానుయేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే సస్పెండ్‌కు సిఫార్సు చేస్తామన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు.. ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అధికారుల దృష్టికి తెచ్చారు. సదస్సులో విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు, సదస్సు సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్.సీహెచ్. శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు ఎ.సునీత, ప్రజాసంఘాల నాయకులు టి.కృష్ణమోహన్, కె.శరత్, విద్యుత్ వినియోగదారుల సంఘం బాపట్ల నియోజకవర్గ విభాగం నాయకులు ఆట్ల బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

బుల్లెట్ బైక్ దొంగల అరెస్ట్

- అందరూ బీటెక్ విద్యార్థులే..
- 16 బుల్లెట్‌లు, స్కూటర్, రూ.25.20 లక్షలను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- యూట్యూబ్ సెర్చ్ చేసి దొంగతనానికి ప్లాన్
- కేసు ఛేదించిన అద్దంకి సీఐ బృందానికి ఎస్పీ ప్రశంసలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ బైకులు, వెనుక నిల్చున్న నిందితులు(ముసుగులో ఉన్నవారు)

అద్దంకి రూరల్: యూ ట్యూబ్ మంచే కాదు చెడూ చేస్తుందనడానికి బీటెక్ విద్యార్థులు దొంగలుగా మారిన ఘటనే ఉదాహరణ. చెడు వ్యసనాలకు బానిసలై, సులువుగా డబ్బు సంపాదించాలని ఆశ వారిని కటకటాల పాల్జేసింది. ఒంగోలులో బీటెక్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఒక ముఠాగా ఏర్పడి ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో బుల్లెట్ బైక్‌లను దొంగిలించారు. అద్దంకి సీఐ బృందం కేసును ఛేదించి దొంగలను పట్టుకున్నారు. చీరాల డీఎస్పీ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అద్దంకికి చెందిన పల్లా సాయిరాం, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన నార్లగడ్డ గోవిందరాజు, నెల్లూరు జిల్లా కావలి మండలం చౌదరిపాలెం గ్రామానికి చెందిన కోడెల పవన్‌కుమార్, ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం యోద్దూరిపాడు గ్రామానికి చెందిన దివీ వేణుగోపాల్, దర్శి మండలం ఈస్ట్ వీరాయపాలెంకు చెందిన రాయపూడి వసంత్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కొత్త పెండ్యాల గ్రామానికి చెందిన జీనెపల్లి నరేంద్రవర్మ, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం, ఆలూరి గ్రామానికి చెందిన అక్కుల వెంకట సాయిరెడ్డిలు ఒంగోలులోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. చెడు వ్యవసనాలకు బానిసైన వీరు సులువుగా డబ్బు సంపాదించే మార్గం చెప్పాలని నిందితుడు గోవిందరాజును సలహా అడిగారు. యూట్యూబ్‌లో సెర్చ్‌చేసి బుల్లెట్ బండ్లు దొంగతనం చేసే విధానాన్ని అందరికీ చూపించాడు. ఈ వీడియో చూసి దానిప్రకారం బుల్లెట్ బండ్లను మాత్రమే దొంగిలించటం ప్రారంభించారు.

శింగరకొండ తిరునాళ్లలో మొదటి దొంగతనం

మొదటగా అద్దంకి మండలం శింగరకొండ తిరునాళ్ల రోజు 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బుల్లెట్ బండిని దొంగిలించారు. నామ్ హైవేపై పెట్టిన బండ్లను, అద్దంకి పట్టణంలోని చినగానుగపాలెం, కాకానిపాలెం, దామావారిపాలెం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, సింగరకొండ గుడి వద్ద కలిపి అద్దంకి స్టేషన్ పరిధిలో 9 బుల్లెట్ బైక్‌లను తస్కరించారు. జె.పంగులూరు పరిధిలో బుల్లెట్, స్కూటీ, చిలకలూరిపేట స్టేషన్ పరిధిలో మూడు బుల్లెట్‌లు, నరసరావుపేట పరిధిలో ఒక బుల్లెట్, మద్దిపాడు, మేదరమెట్లల్లో ఒక్కొక్కటి మొత్తం 16 బుల్లెట్‌లు, ఒక స్కూటీ దొంగిలించారు. మొదటి నిందితుడు పల్లా సాయిరాం, తోటి నిందితులు కొన్ని వాడుకుంటూ మిగిలినవి అమ్ముకుందామని అద్దంకి బ్రహ్మానందం కాలనీలోని పాడుపడ్డ బిల్డింగ్‌లో దాచిపెట్టారు. అద్దంకి పరిసర ప్రాంతాల్లో భారీగా బుల్లెట్ బైక్‌లు చోరీకి గురికావటంతో ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు అద్దంకి సీఐ సుబ్బరాజు బృందం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చాకచక్యంగా దొంగలను మంగళవారం అరెస్టు చేసింది. వారినుంచి 16 బుల్లెట్లు, స్కూటీ, రూ.25.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అద్దంకి సీఐ సుబ్బరాజు, ఏఎస్సై బి.వసంతరావు, హెడ్ కానిస్టేబుల్ జి.అంకమ్మరావు, కానిస్టేబుల్‌లు వి.బ్రహ్మయ్య, పి.బ్రహ్మయ్య, ఎం. వెంకట గోపయ్యలను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

పుర ప్రథమ పౌరుడి ఎన్నిక నేడు

- నేడు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- ప్రధాన పోటీలో పొత్తూరి సుబ్బయ్య, మించాల సాంబశివరావు, మామిడాల రాములు



చీరాల: పట్టణ పుర పౌరుడి ఎన్నికకు బుధవారం ముహూర్తం ఖరారైంది. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిన రెండు నెలల తర్వాత బుధవారం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. చైర్మన్‌గా ఎవరి పేరు ఖరారు చేస్తారనేది సందిగ్ధంలోనే ఉంది. చైర్మన్ కుర్చీకి ప్రధాన పోటీలో పొత్తూరి సుబ్బయ్య, మించాల సాంబశివరావు, మామిడాల రాములు పేర్లు వినిపిస్తున్నాయి. ముగ్గురిలో కూటమికి ఎవరు ఎక్కువగా 'తూకం' పెడతారో వారిదే పైచేయి అయ్యేలా ఉంది. చీరాల రాజకీయాల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఏ చిన్న వ్యవహారం చేసినా రాష్ట్ర వ్యాప్తంగా సమాచారం వెళ్లిపోతుంది. ఈసారి అయినా గట్టి పట్టుదలతో చైర్మన్ అభ్యర్థిని బయటకు పొక్కనీయడం లేదు. దీనికి తోడు ఎమ్మెల్యేతోపాటు ఆయన తనయుడు మహేంద్ర ఎవరిని చైర్మన్ చేయాలనేది మల్లగుల్లాలు పడుతున్నారు. భవిష్యత్తు రాజకీయాల్లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సామాజిక సమీకరణాలు ఎలా ఉంటాయి. చీరాల నైసర్గిక, ఆర్థిక వనరులపై ఒక నిర్ణయానికి వస్తున్నారు. రాత్రికి పార్టీలో ముఖ్యులతో ఎమ్మెల్యే చర్చించుకున్నారు. ఈ దశలో మహిళా కోట అడిగితే అప్పుడు ఏం చేయాలనేది ఒక నిర్ణయానికి వచ్చారు.

టీడీపీ కౌన్సిలర్‌కు గౌరవం దక్కుతుందా..?

టీడీపీ తరఫున గెలిచిన ఏకైక కౌన్సిలర్ కె.యానాదిరావును కాకుండా వైఎస్సార్ సీపీని వీడి కూటమికి మద్దతు పలికిన కౌన్సిలర్లే చైర్మన్ సీటు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎనిమిది నెలల పదవీకాలం మాత్రమే ఉన్నా అవిశ్వాసం పెట్టించి తిరిగి చైర్మన్‌గా కొత్తవారిని ప్రకటించేందుకు కూటమికి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు ఉవ్విళ్లూరుతున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్నారు. డీఆర్వో, ఆర్డీఓ పర్యవేక్షణలో చైర్మన్ ఎన్నికను నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు చైర్మన్, 12 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించనున్నారు. మరి కొద్ది గంటల్లో సీల్డ్ కవర్‌లో ఎవరి పేరు ఉంటుందో తేలనుంది.

కౌన్సిలర్ల చూపు ఎవరి వైపు..?

చీరాల మున్సిపల్ ఎన్నికల్లో 33 వార్డుల్లో ఎక్కువ శాతం వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు విజయం సాధించారు. టీడీపీ నుంచి ఒక్కరు మాత్రమే గెలుపొందారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి 9 మంది ఉన్నారు. 2024లో ఎన్నికల అనంతరం వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు కూటమికి మద్దతు పలికారు. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన తర్వాత చైర్మన్ కుర్చీని అధిరోహించేందుకు పోటీపడుతున్న వారందరూ మొన్నటి వరకు వైఎస్సార్‌సీపీలో ఉన్న వారే. అయితే రేసులో ముగ్గురు పేర్లు ఉన్నాయి. తమ తమ బలాలు నిరూపించుకునేందుకు కౌన్సిలర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కౌన్సిలర్లు ఎవరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారనేది వేచి చూడాలి.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,000 గరిష్టం : రూ. 1,700

మోడల్ ధర రూ. 1,400



పసుపు ధరలు

(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 934

కొమ్ములు : 812 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,400	10,775	10,400

కాయలు : 122 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,400	10,775	10,350

మొత్తం అమ్మకాలు : 700.500 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	53,761
అమ్మకాలు	52,228
నిల్వ	7,478

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,400
సూపర్-10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,600
నంబరు-5	10,000-13,500
341	10,000-13,500
4884	10,000-12,500
సూపర్-10	10,000-13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,600
బాడిగ-355	10,000 - 12,300
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,500
బాడిగ - 355	10,000-12,600
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

అవినీతి మయం నాణ్యత దూరం

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షల్లో భారీ అక్రమాలు

- విద్యాశాఖ మంత్రి నివాసానికి కూతవేటు దూరంలో కోట్ల విద్యావ్యాపారం
- పచ్చచొక్కాల ఆధ్వర్యంలో పైసల చాటున పరీక్షలు
- పరీక్షల పేరిట స్టడీ సెంటర్ల దందా
- ప్రతి దానికి ఒక రేటు..
- ఏఎన్‌యూ పరిధిలో 'పచ్చ'గా విద్యా వ్యాపారం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా పరీక్షలు అక్రమాలకు నిలయంగా మారాయి. విద్యాశాఖ మంత్రి నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న విశ్వవిద్యాలయంలో దూర విద్య పరీక్షల పేరిట రూ.కోట్ల విద్యా వ్యాపారం జరుగుతుంటే అడ్డుకునేవారే లేకుండా పోయారు. ఈనెల 10 నుంచి ప్రారంభమైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా యూజీ, పీజీ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్నాయి. దాదాపు 72 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వర్సిటీలోని కొందరు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పచ్చచొక్కాల నాయకులం అంటూ పరీక్షల్లో రూ.కోట్ల అక్రమ వ్యాపారానికి తెరలేపారు. జిల్లాలోని ఒక ఎంపీ బంధువునంటూ ఒక నాన్‌టీచింగ్ ఉద్యోగి.. ఒక శాసనసభ్యుడికి అత్యంత సన్నిహితుడిని అంటూ ఒక అధికారి.. టీడీపీ నేతలమంటూ ఇద్దరు నాన్‌టీచింగ్ ఉద్యోగులు, ఒక అతిథి అధ్యాపకుడు ఈ విద్యా వ్యాపారంలో కీలక వ్యక్తులుగా మారారు.

వీరు రూటే సెప'రేటు' 4

స్టడీ సెంటర్స్ ద్వారా ఏఎన్‌యూ అధికారులు రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. దూర విద్యలో ప్రతి దానికి ఒక రేటు చొప్పున దండుకుంటున్నారు. పర్సనల్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (పీసీపీ) కింద ఇటీవల రూ.4కోట్ల వరకూ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ మొత్తంలో 20 శాతం కమీషన్లు ఒక ఉద్యోగి ఆధ్వర్యంలో వసూలు చేశారు. గతంలో పలుమార్లు సస్పెండ్ అయిన సదరు అవినీతి ఉద్యోగి రూ.80 లక్షల నుంచి రూ. 90 లక్షల వరకు స్టడీ సెంటర్స్ నుంచి సేకరించినట్లు యూనివర్సిటీ సిబ్బంది చెబుతున్నారు. ఆలస్యంగా ఫీజు చెల్లించే విద్యార్థులకు కేటాయించే బఫర్‌లకు కూడా రేట్లు పెట్టి వసూలు చేస్తున్నారు. కొన్ని సెంటర్స్‌కు బఫర్ బుక్‌లెట్‌ను ఒక్కోటి రూ.100 నుంచి రూ. 200 చొప్పున పదివేలకు పైగా విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు.

మా ప్రభుత్వం.. మా ఇష్టం

వర్సిటీలోని కొందరు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తాము అధికార టీడీపీ నేతలమంటూ మా ప్రభుత్వంలో మా ఇష్టం అంటూ దూర విద్య పరీక్షలను రూ.కోట్ల ఆదాయాన్ని ఇచ్చే వ్యాపారంగా మార్చారు. జిల్లాలోని ఒక కీలక శాసనసభ్యుడి అనుచరుడినంటూ దూర విద్యలో ఒక కీలక పదవి దక్కించుకున్న అధికారి ఈ అక్రమ వసూళ్లలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వంలో పరీక్షల విధులు నిర్వహించిన ఈయన అనేక ఆరోపణలు ఎదుర్కొన్నాడు. గతంలో పలుమార్లు సస్పెండ్ అవడం, వర్సిటీ దస్త్రాలు తస్కరించాడనే ఆరోపణలతో పోలీసు విచారణ ఎదుర్కొన్న ఒక నాన్‌టీచింగ్ ఉద్యోగి దూర విద్య అక్రమాల్లో కీలక పాత్రధారి అని వర్సిటీలో బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పక్క జిల్లాలోని ఒక ఎంపీ బంధువునంటూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెత్తనం మొదలు పెట్టిన అధికారి దూరవిద్యా పరీక్షలను శాసించే స్థాయికి ఎదిగాడు.

మంత్రి గారు... పట్టించుకోరూ..!

విద్యాశాఖ మంత్రి నియోజకవర్గం పరిధిలో సగం వచ్చే వర్సిటీలో కోట్లాది రూపాయల అక్రమాలు జరుగుతున్నా.. సదరు అమాత్యులు కనీసం దృష్టి సారించడం లేదు. వర్సిటీలో ఒక వైపు విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నా.. దూర విద్యకేంద్రాల్లో జరుగుతున్న కలెక్షన్ల గురించి వారు పట్టించుకోకపోవడం గమనార్హం.

ఒక్కో దానికి ఒక్కో రేటు

ఇంటి దగ్గర పరీక్ష రాస్తే ఒక రేటు.. పుస్తకం చూచిరాస్తే మరోరేటు.. విద్యార్థి బదులు మరొక వ్యక్తి పరీక్ష రాస్తే రెట్టింపు రేటు అంటూ రాష్ట్రవ్యాప్తంగా అనేక స్టడీ సెంటర్లు ఒక్కో రేటు చొప్పున నిర్ణయించి వసూలు చేస్తున్నారు. పుస్తకాలతో చూచిరాస్తే ఒక్కో పరీక్షకు రూ. 500 నుంచి రూ. 1500 వరకు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థి బదులు మరొకరు పరీక్ష రాస్తే రూ. 1500 - రూ. 2 వేలు దండుకుంటున్నారు. కొన్ని స్టడీ సెంటర్లలో ఇంటి దగ్గర పరీక్ష రాసే అవకాశం కల్పించి ఒక్కో పేపర్‌కు రూ. 2వేల నుంచి రూ. 5వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ కాపీయింగ్ రేట్లను వర్సిటీలోని కొందరు సిబ్బందే నిర్ణయించడం కూటమి అవినీతి పాలనకు నిదర్శనంగా నిలిచింది.

తూతూమంత్రంగా పరిశీలన

నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా పరీక్ష విధులు నిర్వహించేవారిని పరిశీలకులుగా నియమించాల్సిన వర్సిటీ అధికారులు పచ్చ చొక్కాల పైరవీలతో ఆ నియామకాలను తూతూమంత్రంగా చేస్తున్నారు. గత ఏడాది భారీగా డబ్బులు వసూలు చేశారనే ఫిర్యాదులు వచ్చిన వారిని ఈ ఏడాది కూడా పరిశీలకులుగా నియమించారు. వర్సిటీలో పనిచేసే నాన్ టీచింగ్ సిబ్బంది బంధువులకు, విద్యార్థి సంఘాల నాయకులకు, టీడీపీ సామాజిక వర్గానికి చెందిన వారికి అనుబంధ కళాశాలల లెక్చరర్లు అంటూ విధులను కేటాయించారు.

అమరవీరుల కుటుంబాలకు ఆర్మీ అండగా ఉంటుంది

- జేసీవో ఎం.వెంకటరెడ్డి
- కార్గిల్ అమరవీరుడు హాజీ బాషా చిత్రపటానికి ఘన నివాళి



కార్గిల్ అమరవీరుడు హాజీ బాషా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీవో వెంకటరెడ్డి, సైనికులు

చందోలు(కర్లపాలెం): కార్గిల్ అమరవీరుడు మహ్మద్ హాజీ బాషా త్యాగాన్ని భారతీయులు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని, అమరవీరుల కుటుంబాలకు ఆర్మీ అండగా ఉంటుందని ఎనిమిదో మౌంటెన్ డివిజన్ హెడ్ క్వార్టర్ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో) ఎం వెంకటరెడ్డి చెప్పారు. 1999వ సంవత్సరంలో ఆపరేషన్ విజయ్‌లో భాగంగా కార్గిల్‌లో జరిగిన యుద్ధంలో జరిగిన బాంబు బ్లాస్టింగ్‌లో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన జవాన్ మహమ్మద్ హాజీ బాషా అమరుడయ్యారు. 26వ కార్గిగల్ దివస్ సందర్భంగా మంగళవారం 8వ మౌంటెన్ డివిజన్ హెడ్‌క్వార్టర్ జవాన్లు చందోలు గ్రామానికి వచ్చి మాజీ సైనికులతో కలసి కార్గిల్ అమరవీరుడు, సేనా మెడల్ అవార్డు గ్రహీత హాజీబాషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాజీ బాషా కుటుంబ సభ్యులకు కార్గిల్ దివస్ మెమోంటో, ప్రశంసాపత్రం అందజేశారు. హాజీ బాషా పోరాట పటిమను, త్యాగనిరతిని స్థానిక విద్యార్థులకు, గ్రామస్తులకు సైనికులు వివరించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ కార్గిల్ వీరుని గుర్తుగా చందోలు గ్రామానికి మహ్మద్ హాజీ బాషా పేరుతో ముఖమండపం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో 8వ మౌంటెన్ డివిజన్ హవల్‌దార్ రాజేష్, చిరంజీవులు, మాజీ సైనికుల అసోసియేషన్ చందోలు, చెరుకుపల్లి, నిజాంపట్నం బాపట్ల అధ్యక్షులు దావూద్, సస్తక్ సుల్తాన్, టి.సుబ్బారావు, పి.ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల బిక్షాటన



బిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

బాపట్ల: మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరింది. ప్రభుత్వం నుంచి స్పందన కనిపించకపోవడంతో కార్మికులు పట్టణంలో బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి పాత బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె నిర్మించేది లేదని సీఐటీయూ నాయకులు మజుందార్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాత్కాలికంగా ప్రైవేటు వర్కర్లతో పనులు చేయించుకున్నప్పటికీ అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు సమ్మెబాట వీడేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు రత్నం, నాని, అశోక్, పట్టణ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల యూనియన్ నాయకులు మురళీకృష్ణ, హరిబాబు, సామిరెడ్డి, ప్రమీల, నరేష్ పాల్గొన్నారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక పాస్‌పోర్టు డ్రైవ్

తాడికొండ: ఈ నెల 22, 23 తేదీలలో విజయవాడ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం సౌజన్యంతో తుళ్ళూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక పాస్‌పోర్టు డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ డ్రైవ్‌లో రోజుకు 35 - 70 మందికి పాసుపోర్టు జారీ చేస్తామన్నారు. ఇందుకోసం అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూలై 22-23 తేదీలలో స్లాట్ దొరకని వారు ఇతర తేదీలను ఎంచుకోవచ్చని, అధికారులు వాటిని డ్రైవ్ జరిగే తేదీలకు సర్దుబాటు చేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు నిర్ణీత ధ్రువపత్రాలతో జూలై 16-17 తేదీలలో తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో సైతం దరఖాస్తు చేసుకొనేందుకు సంప్రదించవచ్చన్నారు. రూ.1500 చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం జనరేట్ అయిన ఏఆర్ఎన్ నంబరును సీఆర్డీఏ సీనియర్ లైవ్‌లీ హుడ్ స్పెషలిస్ట్ సీహెచ్ శంకర్‌కు అందజేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సీఆర్డీఏ ఫెసిలిటేటర్, లేదా సీహెచ్ శంకర్ 9848424207కు కాల్ చేయాలని తెలిపారు. సాధారణ పాస్‌పోర్టు (మొదటి సారి) కోసం దరఖాస్తు చేసేందుకు అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రంతోపాటు బర్త్ సర్టిఫికెట్, 10వ తరగతి సర్టిఫికెట్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, టీసీలలో ఏదైనా ఒకటి, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఓటర్ ఐడీ మూడింటిలో ఒకటి జతచేయాలన్నారు. పాత పాస్‌పోర్టు గడువు ముగిసినా లేదా రెన్యూవల్, పోయిన పాస్‌పోర్టులకు సంబంధించిన సేవలు ఈ డ్రైవ్‌లో లభ్యం కావన్నారు. పాస్‌పోర్టు సేవల రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ కోసం అమరావతి ప్రాంత వాసులు తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

డీఈఓ కార్యాలయం వద్ద ఎంటీఎస్ టీచర్ల ఆందోళన

పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో సర్దుబాటు వద్దంటూ నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలల్లో మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిపై పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. పల్నాడు జిల్లాలోని దుర్గి, వెల్దుర్తి, బొల్లాపల్లి తదితర మండలాల్లో రెగ్యులర్ టీచర్ల బదిలీ కారణంగా ఖాళీగా ఉన్న పాఠశాలల్లో ఎంటీఎస్ పద్ధతిపై పనిచేస్తున్న టీచర్లను సర్దుబాటు చేసేందుకు మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయానికి రావాల్సిందిగా సమాచారం పంపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది ఎంటీఎస్ టీచర్లకు సమాచారం పంపడంతో సంబంధిత టీచర్లు డీఈఓ కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు.

గతనెలలోనే తమను కౌన్సెలింగ్ ద్వారా వేర్వేరు పాఠశాలలకు పంపారని, మళ్లీ ఇప్పుడు కౌన్సిలింగ్ పేరుతో పల్నాడు జిల్లాలోని మారు మూల మండలాలకు వెళ్లాలని చెప్పడం ఏంటంటూ ఆందోళనకు దిగారు. కాగా, గుంటూరు, పల్నాడు జిల్లాల డీఈఓలు పి.వి.రేణుక, చంద్రకళ ఎంటీఎస్ టీచర్లతో మాట్లాడారు. డీఎస్సీ నియామకాలు జరిగి కొత్త టీచర్లు వచ్చే వరకు పల్నాడు జిల్లాలో విధులు నిర్వహించాలంటూ ఎంటీఎస్ టీచర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఎంటీఎస్ టీచర్ల అంగీకరించలేదు. ఫలితంగా కౌన్సెలింగ్ నిలిచిపోయింది.

ఎక్కువగా కొనుగోలు చేయండి

మేదరమెట్ల: ప్రతి రోజూ ఐదు వందల బేళ్ల వరకు పొగాకు కొనుగోలు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొరిశపాడు మండలం తమ్మవరంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఏవో రామ్మోహన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

చీరాల: ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చీరాల మండలం తోటవారిపాలెంలో చోటుచేసుకుంది. ఈపూరుపాలెం ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. తోటవారిపాలేనికి చెందిన దేగల సాయిగణేష్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

23,24 తేదీల్లో భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మహాసభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దండా లక్ష్మీనారాయణ, సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు

లక్ష్మీపురం: ఈనెల 23, 24 తేదీల్లో పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేటలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గత ఏడు సంవత్సరాలుగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పనిచేయకపోవడం వల్ల కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని చర్చించి భవిష్యత్ ప్రణాళికను ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వారిని అవమానించడమేనన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు, నగర తూర్పు, పశ్చిమ కమిటీల కార్యదర్శులు దీవెనరావు, ఎస్.కె.ఖాసీం వలి, దూదేకుల మస్తాన్ వలి, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు సీతారామయ్య, బోయపాటి అక్కారావు, నికల్సన్, విమల్, తదితరులు పాల్గొన్నారు.

జీడీసీఏ జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ చౌదరి



జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(జీడీసీఏ) నూతన అధ్యక్షుడిగా చుక్కపల్లి రాకేష్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జీడీసీఏ ఉపాధ్యక్షుడు తోట వెంకట శివ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించిన ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా వెంకటరత్నం వ్యవహరించారన్నారు. కార్యదర్శిగా ఎనుముల శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కొంగర రాహుల్ చౌదరి, ఉపాధ్యక్షుడిగా తోట వెంకట శివరామకృష్ణ, కోశాధికారిగా సింగరాజు లక్ష్మీకాంత్, కౌన్సిలర్‌గా నందిరాజు శివ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.

కన్న కొడుకునే కడతేర్చాడు

జీవాల్లో వాటా అడిగినందుకు కొడుకును చంపిన తండ్రి

- ముక్కలుగా నరికి, పూడ్చిపెట్టిన వైనం
- కుమారుడి అదృశ్యంపై మృతుడి పిన్ని ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన
- విచారణలో మరిన్ని విస్తుపోయే వాస్తవాలు
- 2014లో తల్లిని, తండ్రిని చంపిన దుర్మార్గుడు
- విషయం తెలిసి తీవ్ర కోపోద్రిక్తులైన క్రోసూరు మండలం యర్రబాలెం గ్రామస్తులు



ఘటనాస్థలం వద్ద నిందితుడు వెంకటేశ్వర్లు నాయక్‌తో సీఐ పి.సురేష్



మీడియాతో మాట్లాడుతున్న మృతుడి తల్లి కోటేశ్వరీబాయి



మృతుడు మంగ్యానాయక్ (ఫైల్)

క్రోసూరు: తాను సొంతంగా జీవించేందుకు, మేపుకొనేందుకు జీవాల్లో వాటా అడిగిన కుమారుడిని కన్న తండ్రే కడతేర్చిన హృదయ విదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. అచ్చంపేట మండలం పుట్లగూడెం గ్రామానికి చెందిన బూక్యా వెంకటేశ్వర్లు నాయక్, కుమారుడు మంగ్యానాయక్(19)లు జీవాలు మేపుతూ జీవనం సాగిస్తుంటారు. ఈక్రమంలో మూడు నెలల క్రితం క్రోసూరు మండలంలోని యర్రబాలెం గ్రామానికి జీవాలు మేపుకొంటూ వలస వచ్చారు. అయితే ఈనెల 3వ తేదీ నుంచి తమ కుమారుడు కనిపించడం లేదని నిందితుడి రెండో భార్య, మృతుడి పిన్ని ప్రమీలాభాయి ఈనెల 12వ తేదీన క్రోసూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్తపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా.. తన కుమారుడిని తానే చంపినట్లు వెంకటేశ్వర్లు నాయక్ అంగీకరించాడు. ఈనెల 3వ తేదీ రాత్రి జీవాల్లో వాటా అడిగినందుకు కొట్టి చంపి, ముక్కలు చేసి, పూడ్చిపెట్టినట్లు ఒప్పుకొన్నాడు. మృతదేహం పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులకు చూపించాడు.

కోపోద్రిక్తులైన స్థానికులు

సీఐ పి.సురేష్, తహసీల్దార్ వీవీ నాగరాజు సమక్షంలో మంగ్యానాయక్ మృతదేహాన్ని పంచానామా చేసేందుకు వెలికి తీశారు. అన్నెంపున్నెం ఎరుగని కుమారుడిని చంపడంపై క్రోపోద్రిక్తులైన స్థానిక ప్రజలు, పుట్లగూడెం నుంచి వచ్చిన బంధువులు నిందితుడ్ని వదిలిపెట్టకూడదని తమకు అప్పగిస్తే తామే శిక్ష వేస్తామని నిందితుడిని పోలీసుల దగ్గరనుంచి లాక్కునే యత్నం చేశారు. ఈక్రమంలో పోలీసులు లాఠీచార్జి చేసి ప్రజల్ని తరిమివేసి నిందితుడిని పోలీసుస్టేషన్ తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

కన్న తల్లిదండ్రులను చంపిన కసాయి

విచారిస్తున్న క్రమంలో క్రోసూరు పోలీసులకు మరిన్ని విస్తుపోయే వాస్తవాలు వెల్లడయ్యాయి. వెంకటేశ్వర్లు నాయక్ క్రూర నేర చరిత్ర బయల్పడింది. 2014 సంవత్సరంలో తన సొంత తల్లిని అడవిలో నరికి చంపిన కేసులో ప్రస్తుతం బెయిల్ పై ఉన్నాడని తేలింది. అనంతరం తన తండ్రిని సైతం హతమార్చడని, కొన్నాళ్లు జైలు జీవితం గడిపాడని.. తన 3 నెలల కుమారుడిని సైతం చంపివేసిన కేసులో కూడా ఉన్నప్పటికీ సాక్ష్యాలు బలంగా లేని కారణంగా ఆ కేసు నిలవలేదని నిందితుడి మొదటిభార్య, మృతుడి తల్లి కోటేశ్వరీభాయి, గ్రామస్తులు సంఘటనా స్థలంలో మీడియాకు వివరించారు. అచ్చంపేట సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ రవిబాబు కేసును విచారిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగంలో నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురిని పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం కమిటీలో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎస్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా సత్తెనపల్లికి చెందిన చిలకల జయపాల్, పెదకూరపాడుకు చెందిన చిలకల పెదబాబును నియమించారు.

20న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్స్, సీనియర్స్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు ఇ.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొనే చిన్నారులు జనవరి 2, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీలకు హాజరయ్యే వారు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాకలకు 83477 85888 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లక్ష్యానికి మించి ఉపాధి పనులు

డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ మూర్తి



యద్లపాడు: జిల్లాలో ఉపాధి హామీ పనులు లక్ష్యానికి మించి జరుగుతున్నాయని జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ మూర్తి వెల్లడించారు. మంగళవారం యద్లపాడు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, ఉపాధి హామీ పథకం పనులు ప్రగతి, లక్ష్యాలు, ఇతర విషయాలను అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఉపాధి పనుల లక్ష్యం 45 లక్షల పనిదినాలు కాగా, ఇప్పటికే 55.13 లక్షల పని దినాలు పూర్తయ్యాయని, ఇది లక్ష్యానికి మించి సాధించిన ప్రగతి అని వివరించారు. గోకుల షెడ్ల పథకానికి సంబంధించి గత ఏడాది మంజూరైన 740 గోకుల షెడ్లలో 63 షెడ్లు బేస్ లెవల్‌లో ఉన్నాయని, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకం కింద 100శాతం రాయితీని అందిస్తున్నామని ఎంఎస్ మూర్తి తెలిపారు.